ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

గురువారం 8 ఆగస్టు 2024

అడకత్తెరలో..



- నిధుల లేమితో గ్రామ కార్యదర్శుల ఇబ్బందులు
- అప్పులు చేసి గ్రామాలను నెట్టుకొస్తున్న వైనం
- ఒక్కో కార్యదర్శికి రూ.లక్షకు పైగా ఖర్చు
- ప్రత్యేక పాలన ఆరంభం నుంచి ఇదే దుస్థితి

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 7: ఓ వైపు పని ఒత్తిడి.. మరో వైపు నిధుల లేమి.. అయినా తప్పదు గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి బాధ్యత మీదే అంటూ ప్రభుత్వ ఆదేశాలు.. వెరసి గ్రామ కార్యదర్శుల పరిస్థితి 'అడకత్తెరలో పోకచెక్క'లా తయారైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది. ప్రత్యేక పాలన ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు గ్రామంలో ఎలాంటి సమస్యలు వచ్చినా వారి సొంతడబ్బు పెట్టు కుని పనులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఇక మైనర్ గ్రామ కార్యదర్శుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. దీనికి తోడు ప్రభుత్వం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తుండటంతో ఇబ్బం దులు రెట్టింపయ్యాయి. కొన్నిచోట్ల కార్యదర్శులతో పాటు స్పెషల్ ఆఫీ సర్లు కూడా వారి సొంత డబ్బులు పెట్టుకుని మరీ కార్యక్రమాలను నెట్టుకొస్తున్నట్లు సమాచారం.


నిర్వహణ భారం

ఏడు నెలల నుంచి గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత పూర్తిగా కార్యదర్శులపైనే పడింది. గ్రామంలో ఏ పనిచేయాలన్నా డబ్బులు లేకపోతే అంతే పరిస్థితి. వస్తున్న పన్నులు కార్యాలయ నిర్వహణ, సిబ్బంది జీతాలకే చాలడం లేదు. దీంతో కొన్ని నెలలుగా సిబ్బంది జీతాలు సైతం లేక విల విలలాడుతున్నారు. నీటి సరఫరా మొదలు.. పారిశుధ్యం, వీధిదీపాలు, చెత్త వాహనాల నిర్వహణ, ట్రాక్టర్ల ఈఎంఐలు ఇలా ఎన్నో ఇబ్బందులు పడుతూ పంచాయతీ పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. బోరు మోటార్లు బాగు చేయించడం, కల్వర్టులను శుభ్రం చేయించడం,

మిగతా 7వ పేజీలో..

నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాం..

'ప్రత్యేక పాలన నుంచి పంచాయతీల్లో నిధుల కొరత ఉంది. ప్రస్తుతం జరుగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి సైతం ప్రత్యేక నిధులేమి లేవు. జీపీ నుంచి అన్ని కార్యక్రమాలకు డబ్బులు వెచ్చిస్తున్నాం. ఎలాంటి కార్యక్రమాలకైనా కార్యదర్శులమే జేబుల్లో నుంచి పెట్టుబడి పెడుతున్నాం. బ్యాంకుల్లో చెక్కులు కూడా పాస్ కావడం లేదు. ఇలా దాదాపు మేజర్, మైనర్ గ్రామ పంచాయతీల్లో రూ.లక్షకు పైగా డబ్బులు ఖర్చు చేసి ఉన్నాం' అంటూ ఓ పంచాయతీ కార్యదర్శి తన ఆవేదన వ్యక్తం చేశారు.



పల్లెలపై.. పట్టింపేదీ?

చిల్లి గవ్వ లేక గ్రామపంచాయతీల నిర్వహణ అస్తవ్యస్తం

హనుమకొండ టౌన్, ఆగస్టు 7: దేశానికి పట్టు కొమ్మలైన పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీలకు నిధుల్లేక పల్లెలన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పల్లెల అభివృద్ధిపై ప్రభుత్వానికి పట్టింపులేక పోవడంతో ప్రగతికి దూరంగా మగ్గుతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిన నాటి నుంచి పంచాయతీలకు కష్టాలు మొదలయ్యాయి. గ్రామపంచాయతీని నమ్ముకున్న వారంతా రోడ్డున పడ్డారు. కార్మికులతో పాటు సర్పంచ్‌లు తమకు రావాల్సిన పెండింగ్ వేతనాలు, బకాయిల కోసం ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. అయినా ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం.. గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వకుండానే పనులు చేయాలని పంచాయతీ రాజ్ శాఖకు ఆదేశాలు జారీ చేస్తోంది. దీంతో కిందిస్థాయిలో ఉన్న కార్యదర్శులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మరోప క్క నిధులలేమి కారణంగా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సమస్య జటిలమై.. ప్రజలు దోమకాటుకు గురై మంచాన పడుతూ ఆస్పత్రుల ఖర్చులు భరిం చలేక చివరికి ప్రాణాలు వదులుతున్నారు.

నిధులకు మంగళం

పల్లెల్లో ఏ అభివృద్ధి చేపట్టాలన్న కార్యదర్శులు గ్రామ ఆదాయాన్ని నమ్ముకొని పనులు చేయాలి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులను నిలిపివేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో సర్పంచ్, కార్యదర్శులు పంచాయతీని నెట్టుకొచ్చేవారు. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ఎనిమిది నెలలు కావస్తుండటంతో మార్చి నెల నుంచి కేంద్రం కూడా నిధులివ్వడం ఆపేసింది. దీంతో గ్రామ ఆదాయమే పంచాయతీలకు ఏకైక దిక్కుగా మారింది. ఖర్చులు ఎక్కువ, ఆదాయం తక్కువ కావడంతో అభివృద్ధిని గాడిలో పెట్టడం కార్యదర్శులకు సవాల్‌గా మారింది. పంచాయతీల్లో యేటా వచ్చే ఆదాయం రెండు, మూడు నెలలకు కూడా సరి పోవడం లేదని కార్యదర్శులు వాపోతుంటే.. మాతృశాఖేమే జేబులో నుంచి పెట్టుకోవాలని ఒత్తిడి పెంచడం గమనార్హం.

ఉమ్మడి జిల్లాలోని గ్రామపంచాయతీలు	
వరంగల్	323
హనుమకొండ	208
భూపాలపల్లి	241
ములుగు	174
మహబూబాబాద్	461
జనగామ	281
మొత్తం	1,688

స్వచ్ఛదనం-పచ్చ'ధనం'కు నిల్

సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటి నుంచి కార్యదర్శులు గ్రామాభివృద్ధికి తమ జేబులో నుంచి పెట్టుబడి పెట్టుకుంటూ వస్తున్నారు. సర్పంచ్‌లు ఉన్నంతసేపు వారే పెట్టుబడి పెట్టి పల్లెలను ప్రగతి పథాన నడిపించారు. అలా తాము పెట్టిన సొమ్ములను తిరిగి ఇవ్వలేదని సర్పంచ్‌లు, పని చేయించుకుంటూ పైసలు ఇస్తలేరని పంచాయతీ కార్మికులు వివిధ రూపాల్లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇవన్నీ తెలిసినా ప్రభుత్వం మాత్రం ఎలాంటి బడ్జెట్‌ను విడుదల చేయకుండా కొత్తగా స్వచ్ఛదనం- పచ్చదనం పథకాన్ని తీసుకొచ్చి కార్యదర్శులపై ఒత్తిడిని పెంచింది. ఐదు రోజుల కార్యక్రమాన్ని రూపొందించి ఒక్క పైసా విడుదల చేయకుండా కార్యదర్శులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, కార్యదర్శులు సైతం చేసేదేమీ లేక పల్లెల్లో నలుగురిని కలుపుకొని తూతూమంత్రంగా కార్యక్రమాన్ని నిర్వహించి ఐదు రోజుల కార్యక్రమంలో ఏ రోజుకారోజు మమ అనిపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పైసలు ఇవ్వకపోతే పాపం కార్యదర్శులు మాత్రం ఏం చేస్తారని ప్రజలు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. ఇక మాజీ సర్పంచులేమో తమ పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుండటంతో తాము అప్పులు తెచ్చిన చోట వడ్డీలు పెరుగుతున్నాయని వాపోతున్నారు.



- నిధులను నిలిపివేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- పైసలు రాక పనులు చేయడంలో ఇబ్బందులు
- 'స్వచ్ఛదనం- పచ్చదనం'కు డబ్బుల కొరత
- పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక రోగాల బారిన ప్రజలు
- మంత్రి సీతక్క చొరవ తీసుకోవాలని విన్నపం

ముందు పెట్టండి.. తర్వాత వస్తాయి..

8నెలల నుంచి పంచాయతీల్లోని చిన్న చిన్న అవసరాలకు కార్యదర్శులు వారి జేబుల్లో నుంచి డబ్బులు పెట్టుకుంటూ ఆర్థికంగా చతికిలపడతూ వస్తున్నారు. తాజాగా ఆగస్టు 5 నుంచి స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం చేపట్టి ఐదు రోజుల్లో ఒకొక్కరోజు ఒక కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. కానీ పనులు చేసేందుకు మాత్రం పైసలు లేవు.. మీరే జేబుల్లో నుంచి పెట్టండి.. తర్వాత మీ అకౌంట్స్‌కు జమ చేస్తామని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తుండటంతో కార్యదర్శుల పరిస్థితి మూలిగే నక్కమీద తాటికాయ పడ్డ చందంగా మారింది. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి ముందు జిల్లా పంచాయతీ అధికారి నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పలువురు కార్యదర్శులు తమ బాధలను విన్నవించుకున్నప్పటికీ.. తాను చేసేది ఏమీ లేదని, ఏమైనా ఉంటే కలెక్టర్‌కు చెప్పుకోండి.. అంటూ దాటేసినట్లుగా సమాచారం. జిల్లా పంచాయతీ అధికారి నుంచే సరైన మద్దతు లేనప్పుడు తమకు దిక్కెవరని కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు.

పల్లెల్లో రోగాల విజృంభణ

నిధుల లేమితో పల్లెల్లో దోమల నివారణకు పిచికారి, చెత్త సేకరణ అరకొరగా చేస్తున్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు అందక నిరసన బాట పట్టడం ఒకపక్క అయితే.. మరోపక్క చెత్త తరలిం చేందుకు ట్రాక్టర్లలో డీజిల్ పోయ లేక మరోపక్క పల్లె ల్లో శానిటేషన్ దుర్భరంగా తయారైంది. వర్షాకాలం నేపథ్యంలో మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగి చెత్తంతా జమై పల్లెల్లో దోమలు విజృం భిస్తున్నాయి. దీంతో దోమకాటుకు ప్రజలు మంచాన పడుతున్నారు. దీంతో ఇటీవల పల్లెల్లో జ్వరాలు పెరిగి డెంగీతో మరణించిన సందర్భాలు ఉన్నాయి. గ్రామాల అభివృద్ధికి సరిపడా నిధులను సమకూర్చి పల్లెల్లో ఆరోగ్య వాతావరణం కల్పించేలా పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా పనులు జరుగుతున్నాయి..

- లక్ష్మీరమాకాంత్, జిల్లా పంచాయతీ అధికారి



స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఐదురోజుల పాటు గ్రామాలల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పల్లెలను శుభ్రంగా తయారుచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దానిలో భాగంగా ఈ నెల 5 నుంచి 3 రోజులుగా రోజుకొక్క కార్యక్రమంతో గ్రామాల్లో ఎలాంటి అటంకాలు లేకుండా కార్యదర్శులు విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోకి వెళ్లి పరిశీలిస్తే కార్యక్రమం ఏ విధంగా జరుగుతుందనేది అర్థమవుతుంది.

గూడూరులో 'డబుల్ బెడ్‌రూం' లొల్లి

- లబ్ధిదారుల ఎంపికలో గందరగోళం
- అనర్హులకు కేటాయించారని స్థానికుల ఆగ్రహం
- మళ్లీ గ్రామసభ నిర్వహిస్తామన్న అధికారులు



గూడూరు గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకన్న

పాలకుర్తి, ఆగస్టు 7: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్‌బెడ్ రూం ఇండ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక రసాభాసగా సాగింది. పాలకుర్తి మండలం గూడూరులో బుధవారం డబుల్‌బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు అధికారులకు గ్రామసభ నిర్వహించారు. మొత్తం 70 డబుల్‌బెడ్ రూం ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉండగా దరఖాస్తులు 232 వచ్చాయి. స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న ఆధ్వర్యంలో వారిలో 74మందిని అర్హులుగా ప్రకటించారు. కాగా, దానిపై స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ ఆందోళన చేపట్టారు. స్టేజీ వద్దకు దూసుకు రావడంతో సీఐ మహేందర్‌రెడ్డి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. మరోసారి ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. 550కి పైగా దరఖాస్తులు ఉంటే 232 దరఖాస్తులను మాత్రమే చూపుతున్నారని ఆరోపించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. చివరికి ఆర్డీవో డీఎస్ వెంకన్న స్పందిస్తూ కలెక్టర్ ఆదేశం మేరకు మరోమారు లబ్ధిదారుల ఎంపిక చేస్తామని ప్రకటించడంతో శాంతించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్,

మిగతా 8వ పేజీలో..



చేనేత కార్మికులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్

చేనేత వస్త్రాలు చిరస్థాయిగా నిలవాలి

- చేనేత దినోత్సవంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, ఆగస్టు 7: చిరకాలం నిలిచిపోయేలా చేనేత వస్త్రాలు ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సుమారుగా 18000ల మంది చేనేత కార్మికులు ఉన్నారని, 2000 చేనేత మగ్గాలకు జియో ట్యాగింగ్ ఉందని అన్నారు. జియోగ్రఫీ ఇండికేటర్ జోన్లో మాత్రమే చేనేత వస్త్రాలను తయారు చేయాలని, ఎక్కడైనా డూప్లికేట్ వస్త్రాలు తయారు చేస్తే కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖల కింద నడిచే డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమేషన్ అఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సంప్రదాయ వస్త్రాలతో పాటు మారుతున్న అభిరుచులకు తగ్గట్టు డిజైన్లు ఉండాలని సూచించారు. ప్రస్తుత రోజుల్లో చాలా మంది యాప్‌లో షాపింగ్ చేస్తున్నారని, కార్మికులు కూడా చేనేత వస్త్రాలను ఆన్‌లైన్ మార్కెటింగ్ చేయాలని అన్నారు. మహిళా శక్తి పథకం ద్వారా చేనేత మహిళా కార్మికులు లబ్ధి పొందాలన్నారు. చేనేత వస్త్రధారణ భవిష్యత్ తరాల వారికి స్ఫూర్తిగా ఉండాలన్నారు. అనంతరం చేనేత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చేనేత ప్రాధాన్యతపై నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన

ప్రపంచ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా కలెక్టర్ బుధవారం ఎంసీహెచ్‌లోని గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, ముర్రుపాలు అమృతంతో సమానమని, చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. గర్భిణులు, బాలింతలకు ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడి టీచర్లు ఆవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్‌రావు, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్

జనగామ రూరల్, ఆగస్టు 7: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ ఎస్ఈ వేణు మాధవ్ అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో సబ్‌స్టేషన్ సిబ్బందికి సేఫ్టీ జాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే 1064, 9281033233 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ వేణుగోపాల్, ఏఈ శంకర్, ఇన్‌చార్జి ఏఈ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ సిబ్బందికి సేఫ్టీ జాకెట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఈ వేణుమాధవ్

కండక్టర్ సస్పెన్షన్‌పై ఆర్టీసీ కార్మికుల కన్నెర్ర

- జనగామ బస్ డిపో ఎదుట కండక్టర్ల నిరసన
- విధులు బహిష్కరించి 9 గంటల పాటు బైఠాయింపు



సస్పెండైన కండక్టర్ శంకర్‌నాయక్



ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పుతున్న జనగామ ఏసీపీ పార్థసారథి

జనగామ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బస్ కండక్టర్ సస్పెన్షన్‌పై ఆర్టీసీ కార్మికులు కన్నెర్ర చేశారు. అకారణంగా సస్పెండ్ చేశారంటూ అధికారులపై మండిపడ్డారు. జనగామ డిపో ఎదుట 9గంటల పాటు బైఠాయించి నిరసన చేపట్టారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారంటూ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బుధవారం తెల్లవారుజామున 5.30 గంటలకే బాధిత కండక్టర్ భార్య, పిల్లలతో కలిసి తోటి కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బంది బస్సు డిపో ఎదుట బైఠాయించారు. మధ్యాహ్నం 2.30గంటల వరకు ఏకంగా 9గంటల వరకు విధులు బహిష్కరించి డిపో గేటుకు అడ్డంగా కూర్చొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత కండక్టర్ భూక్య శంకర్ నాయక్ మాట్లాడుతూ ఈనెల 1న హనుమకొండ నుంచి ఉప్పల్‌కు వెళ్లే బస్సు ప్రయాణికులతో నిండిపోయి ఉందని, అదే సమయంలో ఓ నిండు గర్భిణీ ఎక్కిందని అన్నారు. ఆమెకు సీటు లేకపోవడంతో సీటు ఇవ్వాలని ప్రయాణికులను రిక్వెస్ట్ చేశానని, ఎవరూ ఇవ్వకపోవడంతో బస్సులో గర్భిణీకి అలాట్ చేసిన సీటులో ఉన్న ఓ మహిళను గర్భిణీకి సీటు ఇవ్వాల్సిందిగా సూచించానన్నారు. దీంతో ఆమె సీటు నుంచి లేవక పోగా తనను ఇష్టం వచ్చినట్లుగా దుర్భాషలాడిందని, దీంతో బస్సులో ఉన్న మహిళంతా ఆమెను తలోమాట అనడంతో బస్సు దిగి వెళ్లిపోయిందన్నారు. కాగా.. తానేమీ అనకపోయినా తానే బలవంతంగా బస్సులో నుంచి దించినట్లుగా 'ఎక్స్'లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేసిందని వాపోయారు. తాను ఆమెను గర్భిణీకి సీటు ఇవ్వాలని కోరాననే తప్ప ఎలాంటి తప్పు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా, ఆర్టీసీ కార్మికుల ఆందోళనకు కాంగ్రెస్, సీపీఎం, సీపీఐతో పాటు పలు ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. కండక్టర్ వాదన వినకుండా ఏకపక్షంగా విచారణ చేసి సస్పెండ్ చేశారని అధికారుల తీరుపై మండిపడ్డారు. ఆందోళన ఉధృతం కావడంతో ఆర్టీసీ అధికారులు రంగంలోకి దిగారు. వరంగల్ ఆర్ఎం విజయభాను, డిప్యూటీ ఆర్ఎంవో భానుకిరణ్ జనగామకు చేరుకుని రాజకీయ పార్టీలు, ఆర్టీసీ యూనియన్ నాయకులు, కండక్టర్‌తో చర్చలు జరిపారు. అయినప్పటికీ కండక్టర్లు ఆందోళన విరమించలేదు. ఈ క్రమంలో రాజకీయ నేతలను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా కార్మికులు అడ్డుకున్నారు. చివరగా సస్పెండ్ అయిన కండక్టర్‌తో మరోసారి చర్చలు జరపగా ఆందోళన విరమించారు. 10, 15 రోజుల్లో పూర్తి స్థాయి విచారణ చేసి నిర్ణయం తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

భారీగా పోలీసుల మోహరింపు

కండక్టర్ల ఆందోళనతో జనగామ డిపో ప్రాంగణం ఉద్రిక్తంగా మారింది. పెద్ద సంఖ్యలో కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది విధులు బహిష్కరించి నిరసన చేపట్టడంతో పోలీసులు భారీగా మోహరించారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీలు పార్థసారథి, భీంశర్మతో పాటు జనగామ, నర్మెట్ట, రఘునాథపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ సీఐలు రఘుపతిరెడ్డి, సాయిరమణ, శ్రీనివాస్‌రెడ్డి, వేణుతో పాటు ఐదుగురు ఎస్సైలు, కానిస్టేబుళ్లు, 15 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది మోహరించారు. కాగా, కండక్టర్ల ఆందోళనతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. 80 బస్సులు డిపోలోనే నిలిచిపోయాయి.

చెరువుల్లో గుర్రపు డెక్కలు తొలగించాలి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 7: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 9 చెరువులు, కుంటలలో గుర్రపు డెక్కలు పెరిగి పరిసరాలు కలుషితమవుతున్నాయని, చెరువుల్లో మొలిచిన గుర్రపు డెక్కలను వెంటనే తొలగించాలని చెరువులు, ఆక్రమణ ఏరియాల పరిరక్షణ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ వెల్లడించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి వినతి పత్రం సమర్పించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం నాయకులు నగేశ్, వెంకటేశ్వర్లు, క్రాంతి ఉన్నారు.

అడకత్తెరలో 'కార్యదర్శి'

(5వ పేజీ తరువాయి)

పైపులైన్ లీకేజీలు అరికట్టడం, చేతిపంపులు పాడైతే సరిచేయడం, నీటి ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్, ఇలా గ్రామంలో తర చూ ఏర్పడే సమస్యలనీ కార్యదర్శులే సొంత డబ్బులు పెట్టుకొని చేయాల్సి వస్తోంది. నిధులు జీపీలో లేకపోవడం వల్ల ఈ సమస్య ఉందని చెప్పకనే చెబుతున్నారు. ఈ వెతలు ప్రభుత్వం నియమిం చిన ప్రత్యేకాధికారులకు సైతం కొన్ని చోట్ల లేకపోలేదు. తమ జీతాల్లో నుంచి ప్రతీ నెలా జీపీకి ఖర్చుపెట్టే వారు కూడా ఉన్నారు.

మార్చిలో కేంద్ర నిధులు

ప్రత్యేక పాలన ప్రారంభమైన తర్వాత ఈ ఏడాది మార్చి నెలలో కేంద్రం జీపీలకు నిధులు విడుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మళ్లీ కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు విడుదల కాలేదు. ఇక రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు కూడా అందకపోవడంతో గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. కొన్ని నెలల పాటు మార్చిలో వచ్చిన కేంద్ర నిధులతో పంచాయతీలు నడిచినప్పటికీ, ముఖ్యంగా మైనర్ పంచాయతీలకు ఇబ్బందులే తలెత్తాయి. మేజర్ గ్రామ పంచాయతీలకు కొంత మేర డబ్బులు ఎక్కువగా విడుదల కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. కానీ, ప్రస్తుతం ఇప్పుడు అందరి పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

భారమైన స్వచ్ఛదనం-పచ్చదనం

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం గ్రామాల్లో ఈనెల 9వరకు జరగనుంది. ఈ కార్యక్రమాలను గ్రామ పంచాయతీ కార్యదర్శులే తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. ఉదయం లేచిన నుంచి సాయంత్రం వరకు కార్యక్రమాల్లో పాల్గొనడమే కాకుండా వాటికి అయ్యే ఖర్చులు పూర్తిగా భరించడం వారి బాధ్యతే. ఇప్పటికే నిధులు లేక ఇబ్బందులు పడుతున్న సెక్రటరీలకు ఈ ప్రోగ్రామ్ పెద్ద సవాల్‌గా మారింది. ఏ పనులు చేయాలన్నా డబ్బులతో ముడిపడి ఉన్న అంశం కావడంతో కార్యదర్శులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ, జిల్లా ఉన్నతాధికారుల విజిటింగ్, కార్యక్రమాలు చేసేందుకు ప్రజలను తీసుకురావడం, పనులు చేసేందుకు ప్రైవేటు వ్యక్తులను కూలీకి తీసుకురావడం, మిషనరీ ఏర్పాటు, దోమల మందులు, బ్లీచింగ్, డోజర్ కిరాయిలు ఇలా ఎన్నో పనులకు డబ్బులు కార్యదర్శులు పెట్టుకోవాల్సి వస్తోంది.

రూ.లక్షకు పైగా ఖర్చు

మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు మైనర్ గ్రామ పంచాయతీల ఖర్చులు కొంచెం అటు ఇటుగా ఉన్నా వసతుల కల్పనలో సమానంగా ఉంటున్నారు. దీంతో జీపీ కోసం పెట్టే ఖర్చు ఇప్పటికే ఒక్కో కార్యదర్శికి రూ. లక్షకు పైగా దాటిందని తెలుస్తోంది. కొన్ని పనులకు ఎంబీ రికార్డులు చేయించి మరీ సిద్ధంగా ఉన్నారు. కానీ, గ్రామంలో మౌలిక వసతుల కల్పన కోసం పెట్టే ఖర్చులు రాసి పెట్టుకుంటున్నారు. దీంతో తమ జీతాలే కాకుండా బయట తెలిసిన వ్యక్తుల వద్ద అప్పులు చేసి గ్రామాలను నెట్టుకొస్తున్నారు. వీరికి సహకారంగా కొన్ని చోట్ల ప్రత్యేక అధికారులు చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

ఖాతాల్లో డబ్బులు ఫ్రీజ్

కొన్ని గ్రామపంచాయతీల్లో నిధులు ఉన్నప్పటికీ వాటిని విడుదల చేసేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఖాతాల్లో ఉన్న డబ్బులు తీసేందుకు చెక్కులతో బ్యాంకుకు వెళ్తే పాస్ కావడం లేదు. దీనిపై అధికారికంగా జిల్లా పంచాయతీ అధికారులు ధ్రువీకరించనప్పటికీ ప్రస్తుతం కార్యదర్శులు ఎదు ర్కొంటున్న సమస్యలు ఇవే. డబ్బులు ఉన్నట్లు చూపుతున్న ప్పటికీ వాటిని డ్రా చేసేందుకు మాత్రం వీలు లేదు. దీంతో మరింత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో గ్రామంలో కొన్ని పనులు చేసి వాటిని తీసుకోని సదరు కాంట్రాక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులకు సైతం ఈతిప్పలు తప్పడం లేదు.

రాజకీయ ఒత్తిడి

ప్రత్యేక పాలన ప్రారంభమైన నాటి నుంచి కార్యదర్శులకు రాజకీయ ఒత్తిడి కూడా ఎక్కువైందనే చెప్పాలి. సర్పంచ్ లేకపోవడంతో ఏ చిన్న సమస్య ఏర్పడినా ఇటు ప్రజలతో పాటు ఇతర అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామా ల్లో చోటామోటా నాయకులు కార్యదర్శినే ప్రశ్నిస్తున్నారు. తమ కాలనీకి నీళ్లు రావడం లేదనో, స్ట్రీట్ లైట్ వెలగడం లేదనో, దోమల మందు కొట్టడం లేదనో ఏదో విధంగా కార్యదర్శిని ఏకంగా బెదిరింపులకు సైతం దిగుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ప్రత్యేక నిధులు అందించి ఇబ్బందులు లేకుండా చేస్తే బాగుంటుందని కోరుతున్నారు.

రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 7: హనుమకొండ ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీలో 50 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మసీ, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 30 యేళ్ల వయస్సుగల నిరుద్యోగులు అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉపాధి కల్పన కార్యాలయానికి ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7893394393లో సంప్రదించాలన్నారు.

తెలుగులో సంపత్‌రెడ్డికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధకుడు వంగాల సంపత్‌రెడ్డి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు బుధవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి సంపత్‌రెడ్డికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'చెరబండరాజు నవలలు, కథలు - తెలంగాణ జనజీవితం' అనే అంశంపై కేయూ మాజీ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే పర్యవేక్షణలో వంగాల సంపత్‌రెడ్డి పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వీరు అనేక అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన వంగాల సంపత్‌రెడ్డిని నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ లెక్చరర్ కొమురారెడ్డితో పాటు పలువురు అభినందించారు.

అంతర్జాతీయ సెమినార్‌కు సంకినేని వెంకట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌కు ఈనెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో జరిగే అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు బుధవారం సెమినార్ నిర్వాహకులు వెంకట్‌కు ఆహ్వానం పంపినట్లు తెలిపారు. 'ట్రైబల్ లైవ్‌లీ వుడ్ ఫార్మన్స్ ఇష్యూష్ స్ట్రాటజీస్ ఫర్ ఇంపవర్‌మెంట్' అనే అంశంపై జరిగే సదస్సులో డాక్టర్ సంకినేని వెంకట్ 'డెమోక్రటైజేషన్ ఇన్ ట్రైబల్ ఏరియాస్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పిస్తారు. ఈ సందర్భంగా వెంకట్‌ను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, రాజనీతిశాస్త్ర అధ్యాపకులు అభినందించారు.

డాక్టర్ అడ్లూరికు భారత్ సేవా పరస్కారం



హనుమకొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణిత శాస్త్రవేత్త, గణిత అవధాని డాక్టర్ అడ్లూరు నర్సింహమూర్తికి బెంగుళూరుకు చెందిన వెయిల్ ఫౌండేషన్ ఇండియా భారత సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. నాలుగు దశాబ్దాలుగా గణిత రంగంలో చేసిన విశేషసేవలకు, చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఆయన ప్రతిష్ఠాత్మకమైన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. డాక్టర్ అడ్లూరు గణితంపై రాసిన పదమూడు పరిశోధనా వ్యాసాలు వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఆయనను ఇప్పటికే పలు అవార్డులు వరించాయి. ముంబైకి చెందిన ఎంపీఎల్‌ఏ ట్రస్ట్ రాష్ట్రీయ ఆచార్య శిరోమణి అవార్డును, కిందటేడు గోవా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టర్‌ను ప్రదానం చేశాయి. గణిత అష్టావధానాలతో గుర్తింపు పొందిన డాక్టర్ నర్సింహమూర్తి తెలుగు బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కించుకున్నారు. మదర్ థెరిస్సా అవార్డును అందుకున్నారు.

'సినారె' పురస్కారానికి మహేందర్ ఎంపిక



హనుమకొండ కల్చరల్, ఆగస్టు 7: హనుమకొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు బిల్ల మహేందర్‌కు రాష్ట్ర స్థాయిలో అందించే సినారే పురస్కారం-2024కు ఎంపికయ్యారని సంస్థ అధ్యక్షుడు మడకెల్లి రాములు, నిర్వాహకులు డాక్టర్ పోరెడ్డి రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మహాకవి సినారే కళాపీఠం యేటా డాక్టర్ సి.నారాయణరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో సాహిత్య రంగంలో విశేషకృషి చేసిన వారిని ఎన్నికచేసి ఈ పురస్కారాన్ని అందిస్తున్నారు. దానిలో భాగంగా జిల్లా నుంచి మహేందర్‌కు ఈ యేడు పురస్కారం లభించింది. పదిహేనేళ్లుగా మహేందర్ వివిధ ప్రక్రియలో సాహిత్య సేవ చేస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ సామాజిక, సమకాలిన అంశాలపై ఆరు కవితా సంపుటాలతో పాటుగా తన సంపాదకత్వంలో నాలుగు సంకలనాలను అచ్చు వేశారు. ఈ నెల 10న హైదరాబాద్‌లో సినారే కళా పీఠం వారి ఆధ్వర్యంలో తెలంగాణ తొలి సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా ఈ సత్కారం జరుపబడుతుందని నిర్వాహకులు తెలియజేశారు. మహేందర్‌కు పురస్కారం లభించడంపై ఓరుగల్లు కవులు, రచయితలు, ఉపాధ్యాయులు సంతోషంతో పాటు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సామల సదానందం



మంత్రి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆడెపు శ్రీనివాస్

ఇద్దరు నేతన్నలకు రాష్ట్ర స్థాయి అవార్డులు

హైదరాబాద్‌లో అందజేసిన మంత్రి తుమ్మల

ఆటోనగర్ (వరంగల్), ఆగస్టు 7: జాతీయ చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో బుధవారం వేడుకలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి చేనేత జౌళి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ క్రమంలో వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన ఇద్దరు చేనేత కార్మికులు సామల సదానందం, ఆడెపు శ్రీనివాస్‌కు ఆయన కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డులతో పాటు రూ.25వేల నగదు బహుమతిని చెక్కుల రూపంలో అందజేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి చేనేత కార్మికుల పోటీల్లో సామల సదానందం(సీఎం రేవంత్‌రెడ్డి బొమ్మ), ఆడెపు శ్రీనివాస్(మహాత్మా గాంధీ బొమ్మ)ల డిజైన్లను నేసి ప్రదర్శించినందుకు గాను ఈ అవార్డులకు ఎంపికయ్యారు. అనంతరం వరంగల్ కార్పెట్లను వివిధ దేశాలకు, దేశంలోని వివిధ రాష్ట్రాలకు సొంత మార్కెట్ వ్యవస్థను నెలకొల్పి చేనేత కార్మికులకు నూతన డిజైన్ల ఆర్డర్లను ఇప్పిస్తూ చేనేత కార్మికులకు పనికల్పిస్తున్న వరంగల్ కొత్తవాడకు చెందిన యువకుడు చిప్ప కిరణ్‌కుమార్ నేతను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అభినందించారు. కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజరామయ్యార్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పప్పుల వెంకటేశం, డిప్యూటీ డైరెక్టర్ ఇందుమతి, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వరు, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి, నాయకులు ఎం.రవికుమార్, వరలక్ష్మి, రూప తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి ఎస్డీఎల్‌సీఈ ఎంఎస్‌డబ్ల్యూ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు7: కాకతీయ యూనివర్సిటీ మాస్టర్ ఆఫ్‌సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) ఫైనల్ ఇయర్ పరీక్షలు ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను వెల్లడించారు. ఆగస్టు 17, 20, 24, 28, 30, సెప్టెంబరు 2వ తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. అభ్యర్థులకు క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షలకేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

13 నుంచి దూరవిద్య బీఎల్ఐఎస్సీ పరీక్షలు

ఈనెల 13 నుంచి బ్యాచ్‌లర్ ఆఫ్ లైబ్రరీ ఇన్ఫర్మేష న్ సైన్స్ (బీఎల్ఐఎస్సీ) ఎక్స్‌అభ్యర్థుల రివైజ్డ్ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఆగస్టు 13, 16, 19, 21, 23, 27, 29 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగు తాయని పేర్కొన్నారు. అలాగే ఆగస్టు 30న మధ్యాహ్నం ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

13 నుంచి బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు


ఈనెల 13నుంచి కేయూ బీఎల్ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయి. ఆగస్టు 13, 16, 19, 21 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాల, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కేయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు షురూ

కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని పీజీ కోర్సుల ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్) రెండో సెమి స్టర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్షలు ఆగస్టు 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. వర్సిటీ పరిధిలో 5,150 మంది పరీక్షలు రాయనున్నారు. బుధవారం పరీక్షల నిర్వహణను పరీక్షల నియంత్రణాధికారులు పరిశీలించారు.



నిండుకుండలా లక్నవరం చెరువు



మత్తడి దుంకుతున్న లక్నవరం జలాలు

లక్నవరం చెరువుకు మత్తడి

గోవిందరావుపేట, ఆగస్టు 7: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రఖ్యాత లక్నవరం చెరువు మత్తడి పోస్తోంది. 33.6 అడుగుల నీటినిల్వ సామర్థ్యం కలిగిన చెరువు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోగా ఎగువ నుంచి పెద్దఎత్తున వరద పోటెత్తడంతో బుధవారం ఉదయం నుంచి 5 సెంటీమీటర్ల ఎత్తులో జలాలు మత్తడి దునుకుతున్నాయి. దీంతో దయ్యాలవాగులో ప్రవాహం పెరిగింది. కొత్తగూడ, గంగారం అటవీ ప్రాంతం నుంచి, బొగ్గుల వాగు నుంచి లక్నవరానికి వరద కొనసాగుతోంది.

నిండా నీటితో కళకళలాడుతున్న లక్నవరం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. తేలికపాటి వర్షాలు కురుస్తుండటం, సందర్శనకు ఆంక్షలు లేకపోవడంతో చెరువులో బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను తిలకించేందుకు టూరిస్టులు తరలిరానున్నారు.



జలకళతో పాకాల సరస్సు



మత్తడికి చేరువైన నీరు

మత్తడికి చేరువలో పాకాల చెరువు

ఖానాపురం, ఆగస్టు 7: వరంగల్ జిల్లాలోనే సాగునీటి వనరుల్లో పెద్దదైన పాకాల సరస్సు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. సరస్సు జలకళను సంతరించుకొని మత్తడికి చేరువలోకి వచ్చింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సు బుధవారం నాటికి 29.8 అడుగుల నీటిమట్టానికి చేరుకుని నిండు కుండలా ఉంది. సరస్సు పూర్తి నీటి సామర్థ్యం 30.2 అడుగులు కాగా, మరో ఆరు ఇంచుల నీరు చేరితే మత్తడితో పరవళ్లు తొక్కనుంది. పాకాల ఆయకట్టులో వరినాట్లు జోరుగా సాగుతున్న తరుణంలో ఆయకట్టు రైతులు జలకళను సంతరించుకున్న పాకాల సరస్సును సందర్శించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గూడూరు మండలం భీమునిపాదం జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ఉప్పొంగుతున్న భీమునిపాదం

జలపాతం వద్ద పర్యాటకుల సందడి

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 7 : ఎత్తైన గుట్టలు, ఆరుదైన వృక్షాలు, అబ్బురపరిచే భీమునిపాదం జలపాతం వద్ద పర్యాటకుల సందడి పెరిగింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప అటవీప్రాంతంలో ఉన్న భీముని పాదం జలపాతం 70 ఫీట్ల ఎత్తునుంచి వాటర్‌ఫాల్స్ జాలువారుతున్నాయి. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి భీమునిపాదంలో వాటర్‌ఫాల్స్ ఉధృతంగా జాలువారుతున్నాయి. పచ్చని ప్రకృతి నడుమ, ఆహ్లాదకరమైన వాతావరణంలో వాటర్‌ఫాల్స్ కింద తడుస్తూ పర్యాటకులు కేరింతలు కొడుతున్నారు. భీమునిపాదంలో పచ్చని ప్రకృతిని ఆస్వాదించడానికి వాచ్‌టవర్ కూడా నిర్మించిన విషయం విదితమే. బుధవారం కురిసిన వర్షానికి భీముని పాదంలో వాటర్‌ఫాల్స్ భారీస్థాయిలో జాలువారుతుండడంతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. హన్మకొండ నుంచి భీమునిపాదంకు కేవలం 70 కిలోమీటర్లు, మహబూబాబాద్ నుంచి 40 కిలో మీటర్లు ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు, అటవీశాఖసిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కేయూ డిగ్రీ విద్యార్థులకు ఇన్‌స్టంట్ అవకాశం

- 6వ సెమిస్టర్ ఏదైనా ఒక్కపేపర్ తప్పిన వారికే..
- 12 వరకు ఫీజు గడువు.. 17న పరీక్ష..

కేయూ క్యాంపస్, ఆగస్టు 7: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ విద్యార్థులకు వర్సిటీ అధికారులు సువర్ణ అవకాశాన్ని కల్పించారు. ఇటీవల నిర్వహించిన డిగ్రీ 6వ సెమిస్టర్‌లో ఏదైనా ఒకే ఒక్క పేపర్ తప్పిన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రత్యేకంగా ఇన్‌స్టంట్ పరీక్షను నిర్వహిస్తారు. వర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ తదితర కోర్సుల్లో ఆఖరు సెమిస్టర్‌లో ఏదైనా థియరీ పేపర్‌లో తప్పిన అభ్యర్థులు ఆగస్టు12 వరకు ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలదేవి బుధవారం తెలిపారు. బీఏ, బీకామ్, జనరల్ (బీఏ లాంగ్వేజేస్) అభ్యర్థులు రూ.450, బీఏ, బీబీఏ, బీకాం, బీఎస్సీ, కంప్యూటర్ అభ్యర్థులు రూ. 550, బీసీఏ అభ్యర్థులు రూ. 650, బీకామ్ వొకేషనల్ రూ. 720 కళాశాలలో చెల్లించుకోవాలని తెలిపారు. ఫీజులు చెల్లించుకున్న అభ్యర్థులకు ఆగస్టు 17న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. కాగా, కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్‌లో ఎల్‌బీ కళాశాల, హనుమకొండలో వాగ్దేవి డిగ్రీ కళాశాల, ఉమ్మడి ఆదిలాబాద్ మంచిర్యాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాయ్స్) ఉమ్మడి ఖమ్మంలో పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గర్ల్స్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు.

జీపీ కార్మికుల సమ్మె నోటీస్



బచ్చన్నపేట ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న జీపీ ఉద్యోగులు

బచ్చన్నపేట, ఆగస్టు 7: గ్రామ పంచాయతీ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చకుంటే ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమని జీపీ ఉద్యోగుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముందుగా ఈ నెల 8న ఒకరోజు సమ్మె చేస్తున్నట్టు బుధవారం ఎంపీడీవోకు నోటీసు ఇచ్చారు. సరైన స్పందన రాకుంటే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయటంతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. పీఆర్సీ పరిధిలోకి జీపీ సిబ్బందిని తీసుకురావాలన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే దశల వారీగా ఆందోళనలు తప్పవని నాయకులు శ్రీనివాస్, బాబుగౌడ్, ప్రభాకర్ హెచ్చరించారు.

స్టేషన్‌ఘన్‌పూర్: జీపీ కార్మికుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీపాద మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇందుకు నిరసనగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా విధులు బహిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీడి ఆనందం, గూడూరు భాస్కర్, సీఐటీయూ మండల కార్యదర్శి సోమన్న, జగన్నాధం, రాజు, వేల్పుల స్వామి, బోసురాజు పాల్గొన్నారు.

దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



పాలకుర్తిలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పాలకుర్తి, ఆగస్టు 7 : కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ, దళిత మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ అంబేద్కర్ అభయహస్తం కింద ప్రతీ కుటుంబానికి రూ. 12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దుంపల సంపత్, కమ్మగాని శ్రీకాంత్, వేల్పుల దేవరాజ్, సోమేశ్వర్, సంతోష్, మహేష్, రాజు, సైదులు, నరేష్, సమ్మయ్య చారి, మహేందర్ పాల్గొన్నారు.

జఫర్‌గడ్: దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ అనుబంధ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రడపాక ప్రదీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జఫర్‌గడ్‌లో డిప్యూటీ తహసిల్దార్ హరిప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి రుణాలు, షెడ్యూల్ కులాల సాంఘీక సంక్షేమ వసతి గృహాల పునర్నిర్మాణం, తదితర అంశాల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. యువతకు ఉపాధి కోసం రుణాలను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత మోర్చా మండల అధ్యక్షుడు గాదెపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రడపాక నరేశ్, అధికార ప్రతినిధి మారెపల్లి రవి, కొండేటి బాబు, గబ్బెట వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో 'డబుల్ బెడ్‌రూం' లొల్లి

(5వ పేజీ తరువాయి)

ఎంపీడీవో రాములు, డీటీ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌ఐలు శరత్‌చంద్ర, రాకేష్, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల, తరిగొప్పుల ఎస్సైలు సాయిప్రసన్నకుమార్, శ్రావన్‌కుమార్, సృజన్‌కుమార్, పాల్గొన్నారు. కాగా, గ్రామసభను అధికారులు వాయిదా వేసి వెళ్లి పోగానే స్థానికులు తమకు ఇండ్లు దక్కుతాయో లేదోనని సందేహంతో తాళాలు పగుటగొట్టి ఇళ్లను ఆక్రమించుకున్నారు.

కొనసాగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం



కొడకండ్ల పోలీస్‌స్టేషన్లో మొక్క నాటుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

కొడకండ్ల, ఆగస్టు 7: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పాలకుర్తి సీఐ మహేందర్ రెడ్డి అన్నారు. కొడకండ్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ శ్రవణ్‌కుమార్, స్థానిక సిబ్బందితో కలిసి 50 పిచ్చిమొక్కలను తొలగించి, శుభ్రం చేసి మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలను నాటి పర్యవరణ పరిరక్షణ చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేశ్, కానిస్టేబుల్ రఘుపతి, కనకస్వామి, కస్తూరిబా పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. శివునిపల్లి జీపీ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో మురికి కాలువలు శుభ్రం చేశారు. శివునిపల్లి హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్లకార్డులు, నినాదాలతో స్వచ్ఛదనం, పచ్చదనం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.రమేశ్, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, శ్రీనాథ్, రవి తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని ఎంపీడీవో జలంధర్‌రెడ్డి అన్నారు. బుధవారం బండ్లగూడెంలో స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ పాఠశాలలో పారిశుధ్య చర్యలను చేపట్టారు. పిచ్చిమొక్కలను తొలగించారు. పరిసరాల పరిశుభ్రతను ప్రతీ ఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ, కార్యదర్శి సంతోషిమాత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకుర్తి: గూడూరు గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం డబుల్‌బెడ్‌రూం ఇండ్ల ఆవరణలో ఎంపీడీవో రాములు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరు ఇండ్ల ముందు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవీందర్, మాజీ ఎంపీటీసీ బెల్లి దేవేందర్, గుగ్గిల్ల ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి లింగయ్య ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతీ ఒక్కరు తమ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీపాద మధుసూదన్ సూచించారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన నమిలిగొండలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పేరుకుపోయిన వర్షపు నీటిని జీపీ సిబ్బంది చేత తొలగించారు.

బచ్చన్నపేట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు జీపీ సిబ్బంది, ఉద్యోగులు కృషి చేయాలని జడ్పీ సీఈవో సరిత అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె కొడవటూరు గ్రామంలో పర్యటించారు. నీరు నిలిచే ప్రాంతాలు, కాలువలు, అంతర్గత రోడ్లపై ఏర్పడిన గుంతలను పరిశీలించారు. గుంతల్లో నీరు నిలవకుండా చూడాలన్నారు. గ్రామంలోని నర్సరీని, పల్లె ప్రకృతి వనంను పరిశీలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచటంలో కృషి చేసిన కార్యదర్శి రూపచైతన్యను, సిబ్బందిని అభినందించారు. అంతకు ముందు కొడవటూరు సిద్ధేశ్వరాలయంలో సీఈవో పూజలు చేశారు. మండలపరిధిలోని అన్ని గ్రామాల్లో ఎంపీడీవో మల్లికార్జున్, ఏపీవో కృష్ణ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించారు.

స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సిరిసిల్ల రాజయ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు7: స్థానిక సంస్థల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లా 2వ ఆర్థిక సంఘం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ.. గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. గ్రామీణ, పట్టణ సంస్థల అభివృద్ధికి కావాల్సిన నిధులను సమకూర్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్ర స్థానిక సంస్థల అభివృద్ధికి నిధుల మంజూరులో జాప్యం లేకుండా సిఫారసు చేసిన నిధులను మంజూరయ్యేలా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు నిధులు కేటాయించామన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ఎల్, 243వై ఆదేశం ప్రకారం మన రాష్ట్రంలోని అన్ని గ్రామీణ స్థానిక సంస్థలు, పట్టణాల ఆర్థిక స్థితిగతులను సమీక్షించడానికి, ఆర్థిక వనరుల పంపిణీ సిఫారసు చేయడానికి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసిందన్నారు. గ్రామ పంచాయతీల అధికారుల విధులు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 52 ప్రకారం గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు మరిచిపోవద్దని రాజయ్య పేర్కొన్నారు. ప్రతీ గ్రామానికి అవసరమయ్యే అభివృద్ధి పనుల వివరాలు పూర్తి సమాచారం భద్రపరుచుకునేలా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలోని ఆస్తి పన్నుపై మళ్లీ పూర్తి సమీక్ష చేయాలన్నారు. విద్యుత్ చార్జీల అధిక బారం పడకుండా ప్రతీచోట సోలార్ పవర్ ప్లాంట్లను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రతీ గ్రామ పంచాయతీలో క్రమం తప్పకుండా ప్రతీ 60 రోజుల్లో గ్రామసభ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్య, ఇతర అభివృద్ధి పనులకు సకాలంలో నిధులు అందుబాటులో ఉన్నట్లయితే ప్రతీ పనిని త్వరితగతిన పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా ఆర్థిక సంఘం జిల్లాలకు స్పెషల్ ఫండ్స్ మంజూరు చేయాలని కోరారు. బకాయిలు ఉన్న ప్రతీ గ్రామపంచాయతీకి ప్రభుత్వ పనుల చెల్లింపులు వాటికి అయిన నిధులు వెంటనే మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక సంఘం మెంబర్ సెక్రెటరీ స్మితా సబర్వాల్ మాట్లాడారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్, ఆర్థిక సంఘం సభ్యులు రమేష్‌నాయక్, నెహ్రూనాయక్, హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్, జిల్లా పరిషత్ సీఈవోలు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



పాము భిక్షపతిని సన్మానిస్తున్న చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

దేవరుప్పుల, ఆగస్టు 7: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరిగిన కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డుల్లో భాగంగా మండలంలోని కోలుకొండకు చెందిన పాము భిక్షపతిని చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఘనంగా సన్మానించారు. చీరల విభాగంలో ఝాన్సీ రుద్రమదేవి చీర అవార్డుకు భిక్షపతి ఎంపిక కాగా మంత్రి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా భిక్షపతిని జనగామ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు సామల పరమేశ్వర్, జిల్లా నాయకులు కాముని శ్రీనివాస్, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పాము మోహన్ తదితరులు అభినందించారు.

పాలకుర్తి: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మాచెర్ల సారయ్య, నాయకులు చిదురాల మార్కండయ్య, ధనుంజయ, పెనుగొండ రమేష్, తిరుపతి, కృపాకర్, వైట్ల రంగయ్య పాల్గొన్నారు.

జనగామ రూరల్: చేనేత దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ మిలినీయం క్లబ్ అధ్యక్షుడు గాదె నర్సింహులు అధ్యక్షతన బుధవారం జిల్లా కేంద్రంలో ఉచిత డయాబెటిక్ శిబిరం నిర్వహించారు. అనంతరం చేనేత కార్మికులను సన్మానించారు. డయాబెటిక్ శిబిరంలో 50 మందిని పరీక్షించారు. కార్యక్రమంలో ఏనుగు నర్సిరెడ్డి, బండ్ల భిక్షపతి, బోంతపల్లి నాగరాజు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు కలెక్టర్ ప్రశంసలు..

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా జౌళి శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందించారు. ఈ పోటీల్లో జఫర్‌గడ్ ఆదర్శ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని శిరీష ప్రథమ స్థానం సాధించింది. కొడకండ్ల టీజీఆర్ఎస్ విద్యార్థిని దాసరి వందన గౌతం ద్వితీయ స్థానంలో నిలిచింది. బిషప్ తుమ్మబాల హైస్కూల్ విద్యార్థిని యశస్విని తృతీయ స్థానం పొందింది. అదేవిధంగా లింగాలఘణపురం కేజీబీవీ విద్యార్థిని ఎం.దీపిక, బచ్చన్నపేట వాణీ హైస్కూల్‌లో చదువుతున్న లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన నూకల రమ్య ప్రతిభచూపారు. వీరిని కలెక్టర్‌తో పాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పొందిన వారితో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు

జనగామ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్మెట్ట, తరిగొప్పుల మండలాలకు చెందిన 48 మందికి సంబంధించి రూ.12.63 లక్షల విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో నర్మెట్ట, తరిగొప్పుల మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందించిన నాగపురి..

జనగామ రూరల్: జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన పుట్టపాక లక్ష్మి చిన్న వయసు నుంచి బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వైద్యానికి పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు అవుతాయని నిమ్స్ వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన రూ.2,50,000 ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఆ పత్రాన్ని బుధవారం లక్ష్మి కుటుంబ సభ్యులకు కిరణ్‌కుమార్ అందజేశారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

దేవరుప్పుల, ఆగస్టు 7: మండలంలోని పెద్దమడూరు పాఠశాలలో బుధవారం టీపీటీఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ పాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు, ప్రతీ తరగతికి ఉపాధ్యాయుడు చొప్పున స్టాఫ్ ప్యాటర్న్ నియమించాలన్నారు. డీఈడీ, బీఈడీ అర్హతలు కలిగిన ఎస్టీటీలకు కామన్ సీనియారిటీ పద్ధతిలో ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, మెడికల్ రియంబర్స్‌మెంట్, సరెండర్ లీవు బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. లక్ష్మణ్‌జీ, జే. వరప్రసాద్, కార్యదర్శులు సీహెచ్. శ్రీనివాస్, సీహెచ్. నవీన్, పి. వీరారెడ్డి, సజ్జన్, డి. అశోక్, సునీత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దయాకర్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

పాలకుర్తి, ఆగస్టు 7: మండలంలోని టీఎస్‌కే గ్రామంలోని దుబ్బతండాతో పాటు కొండాపురం గ్రామంలోని మేకలతండాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో మాజీ మంత్రి దయాకర్‌రావు ఫ్లెక్సీకి బీఆర్ఎస్ నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నవీన్, మాజీ ఎంపీపీ నాగిరెడ్డి, మాచెర్ల ఎల్లయ్య మాట్లాడుతూ తాజాగా ప్రభుత్వం దుబ్బతండా, మేకలతండాలను నూతన పంచాయతీలుగా ఏర్పాటు చేసిందని, ఇందుకు కృషి చేసింది మాజీ మంత్రి దయాకర్‌రావు అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, పాము శ్రీనివాస్, జరుపుల బాలూనాయక్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్క్రీనింగ్ క్యాంపు

జనగామ రూరల్, ఆగస్టు 7: తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు జిల్లా కేంద్రంలో బుధవారం స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో రాము హాజరై మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలు విద్యారంగంలో రాణించడానికి కొన్ని ఉపకరణాలు అవసరం ఉన్నందున స్క్రీనింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్యాంపుకు 18 సంవత్సరాల లోపు దివ్యాంగులు 103 మంది పాల్గొన్నారని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా ఉపకరణాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో అలిమ్కో డాక్టర్లు వరుణ్, అవినాష్, మోహన్, మండల నోడల్ అధికారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగడి ఆదాయం రూ.21.14 లక్షలు

రఘునాథపల్లి, ఆగస్టు 7: రఘునాథపల్లి మండల కేంద్రంలో ప్రతి గురువారం జరిగే అంగడికి బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. నల్గొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన ఎలుసూరి నర్సింహా రూ.21.14 లక్షలకు పాడి అంగడిని దక్కించుకున్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, ఆగస్టు 7: ఈ నెల 12న స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పోచయ్య బుధవారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 8 నుంచి 12వ తేదీ లోగా ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్పాట్ అడ్మిషన్‌లో ఎంపికైన అభ్యర్థులు ఫీజు రీఎంబర్స్‌మెంట్‌కు అర్హులు కాదన్నారు.

దుర్గామాత ఆలయంలో చోరీ

బచ్చన్నపేట, ఆగస్టు 7: కట్కూరు దుర్గామాత ఆలయంలో చోరీ జరిగింది. అమ్మవారి పుస్తెలతో పాటు ముక్కుపుడక, వెండి కళ్లు, హుండీలోని డబ్బులను ఎత్తుకెళ్లారు. ఆలయ నిర్వాహకురాలు అంజమ్మ రెండు రోజులు వేరే గ్రామానికి వెళ్లి బుధవారం వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

వినియోగదారుల సేవే లక్ష్యం

ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ సదర్‌లాల్



చిలుపూర్ సబ్‌స్టేషన్లో వినియోగదారుల సహాయ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సదర్‌లాల్

చిలుపూర్, ఆగస్టు 7: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా అధికారులతో సహా సిబ్బంది పని చేయాలని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ సదర్‌లాల్ సూచించారు. బుధవారం ఆయన మల్కాపూర్, చిలుపూర్ తదితర గ్రామాల్లో సబ్‌స్టేషన్లను సందర్శించారు. సరికొత్త టెక్నాలజీతో రూపొందించిన వినియోగదారుల సహాయ సేవా కేంద్రాన్ని చిలుపూర్‌లో ప్రారంభించారు. అంతకు ముందు మల్కాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సదర్‌లాల్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 20 సహాయ సేవా కేంద్రాలను ఏర్పాటు చేశామని, విద్యుత్ సమస్యలతో పాటు, ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్, లూజ్‌వైర్లు, లోవోల్టేజీ, గృహ వినియోగదారుల సమస్యలకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చని అన్నారు. ఫిర్యాదులపై ఏఈ, ఏడీ, డీఈ స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా పల్లగుట్ట, కృష్ణాజీగూడెం, ఫతేపూర్, వెంకటాద్రిపేట, మల్కాపూర్ తదితర గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యలను అధిగమించేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్‌లో చిన్నపెండ్యాల, నిడిగొండ సబ్‌స్టేషన్లను పైలట్‌ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసుకుని మానవరహిత సేవలు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వేణుమాధవ్, డీఈలు హుస్సేన్‌నాయక్, ఏడీఈ వంశీకృష్ణ, ఏఈలు పులి చంద్రమోహన్, రమేష్, సబ్ ఇంజనీర్ వినీత్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ ఒడ్డెపల్లి యాదగిరి, జేఎల్ఎం అశోక్, విజయ్, గడ్డం సిద్దయ్య, చెరిపెల్లి సురేశ్, సురేందర్‌రెడ్డి, ఏఈలు నాగలక్ష్మి, మన్విత, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్డీవోగా వసంత

జనగామ రూరల్, ఆగస్టు 7: జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్డీవో)గా పని చేసిన మొగులప్ప నారయణపేటకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో వికారాబాద్‌లో పని చేస్తున్న ఎన్.వసంత వచ్చారు. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించి కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

జనగామ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జనగామ రైల్వే స్టేషన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన చెరుకుపల్లి బాబురావు (50) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కొద్ది కాలంగా ఆయన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఆర్.రమణారెడ్డి తెలిపారు.

ఇన్నోవేటర్స్‌గా రాణించాలి

అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

జనగామ రూరల్, ఆగస్టు 7: చదువుతో నిమిత్తం లేకుండా సరికొత్త ఆవిష్కరణలతో విభిన్న అంశాలను సులభతరమైన పద్ధతుల్లో కనుగొని ఇన్నోవేటర్స్‌గా రాణించాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద ప్రభుత్వ బాలికల పాఠశాలలో బుధవారం ఇన్నోవేటర్స్ ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే ప్రక్రియే ఇన్నోవెటర్ అని, ఇన్నోవేటర్‌లో రాణించాలంటే మెదడుకు పదును పెట్టే పలు అంశాలను సులభతరమైన పద్ధతుల్లో రూపొందించాలని అన్నారు.

కార్యక్రమంలో బీసీడీవో గౌసియా బేగం, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, హెచ్ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



జనగామలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జనగామ రూరల్, ఆగస్టు 7: న్యాయవాదులపై దాడి చేసిన పోలీస్‌లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు రెండో రోజు విధులు బహిష్కరించారు. జనగామ కోర్టు నుచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రఋషి మాట్లాడుతూ న్యాయవాదులపై దాడి చేసిన జనగామ సీఐ రఘుపతి రెడ్డి, ఎస్సై తిరుపతిలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎండీ సాధిక్ అలీ, బి.శంకర్, నర్సింగరావు, బడికె సందీప్, మురళి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ సీఐ, ఎస్సైలపై కేసు

జనగామ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): న్యాయవాద దంపతులపై దాడి చేశారన్న ఆరోపణపై జనగామ సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సై తిరుపతిపై కేసు నమోదైంది. ఈనెల 5న జనగామకు చెందిన న్యాయవాద దంపతులు గద్దల అమృతరావు, కవిత ఓ వృద్ధురాలి కేసు విషయంలో జనగామ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలంటూ సీఐని కోరగా ఇష్టం వచ్చినట్లుగా దుర్భాషలాడి తమపై దాడి చేశారని డీసీపీ రాజమహేంద్రనాయక్‌కు అదే రోజు ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా గురువారం నుంచి నిరాహారదీక్షలతో పాటు వంటావార్పు కార్యక్రమాలకు బార్ అసోసియేషన్ పిలుపునిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టులలో న్యాయవాదులు విధులు బహిష్కరించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పోలీసులు న్యాయవాదులతో జరిపిన చర్చలు సైతం ఫలించలేదు. సీఐ, ఎస్సైలపై కేసు నమోదు చేసేవరకు ఆందోళనలను విరమించేది లేదని న్యాయవాదులు భీష్మించడంతో కేసు నమోదు చేయడం పోలీసులకు అనివార్యమైంది. ఈ క్రమంలో డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆదేశాలతో ఎస్సై చెన్నకేశవులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు.

కాగా, న్యాయవాద దంపతులపై దాడి ఆరోపణల నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మను విచారణ అధికారిగా నియమించారు. ఈ విషయంలో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు.